సాక్షి
నారాయణపేట
మంగళవారం । 19 । నవంబర్ । 2024



ఉద్యోగాల పేరుతో మోసం

రైల్వే, వైద్య శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ నిరుద్యోగులను మోసగించారు.

వివరాలు 8లో ▸



కొండంత దేవుడు..

అమ్మాపురం కురుమతిరాయుడి కొండల్లో గోవింద నామస్మరణ మారుమోగింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.1 /13.7

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టడంతో జిల్లాలో ఉదయం చలి ఉంటుంది. రాత్రి సమయంలో చలితోపాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

20న ప్రజాపాలన విజయోత్సవాలు

నారాయణపేట: తెలంగాణ **ప్రజాపాలన** విజయోత్సవ దినాన్ని ఈ **నెల 20న జిల్లా** కేంద్రంలోని అంజనా గార్డెన్**లో నిర్వహించ** నున్నట్లు కలెక్టర్ సిక్తా **పట్నాయక్** సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో ఏడాదిలో అమలైన సంక్షేమ, అభివృద్ధి పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంగా ప్రభుత్వం ప్రజాపాలన విజయోత్సవాలను నిర్వహించాలని నిర్ణయించి, ఇందుకోసం ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టిందని తెలిపారు. రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళా బృందాలతో వివిధ కార్యక్రమాలను చేపట్టిందని, ప్రతి జిల్లాలో వరుస కార్యక్రమాలు చేపట్టాలని భావిస్తున్న ప్రభుత్వం ఈ నెల 17 నుంచి డిసెంబర్ 7 వరకు కళాబృందాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రచారం చేయనున్నారని తెలిపారు. ఇందుకుగాను సంగీత నాటక అకాడమీ చైర్ పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్య ఆధ్వర్యంలో పుంజల ఒకటో బృందం, అంతడుపుల నాగరాజు ఆధ్వర్యంలో రెండో బృందం వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. జిల్లాలో ఈ నెల 20న అంజనా గార్డెన్‌లో ప్రజాపాలన విజయోత్సవాలు, కళాబృందం ప్రదర్శన నిర్వహిస్తారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని.

కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పంట రుణమాఫీ, ఉద్యోగాల భర్తీ, రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శంకుస్థాపన వంటి సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోందని కలెక్టర్ పేర్కొన్నారు. అలాగే రైతుభరోసా, స్కిల్ యూనివర్సిటీ, ఎస్‌హెచ్‌జీ మహిళలకు రుణాలు వంటి పథకాలపై దృష్టి పెట్టిందని, ఈ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధిని ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లనున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు జిల్లాలో ప్రజా పాలన కళాయాత్ర చేపట్టాలని ప్రభుత్వం సాంస్కృతిక శాఖకు ఆదేశించిందని, ఈ ఉత్సవాలకు ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు.

రాజ్యాధికారంతోనే అభివృద్ధి

మేమెంతో.. మాకంత కావాలి

- రాజకీయ ప్రాధాన్యం లేకుంటే ఏమీ జరగదు
- బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి
- స్థానిక సంస్థల్లో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేయాలి
- బీసీ డెడికేటెడ్ కమిషన్‌కు వెల్లువెత్తిన వినతులు
- మహబూబ్‌నగర్ కలెక్టరేట్ బీసీ రిజర్వేషన్ల గుర్తింపుపై బహిరంగ విచారణ



కులసంఘాల నాయకులతో మాట్లాడుతున్న బీసీ డెడికేటెడ్ చైర్మన్ వెంకటేశ్వర్‌రావు. చిత్రంలో కలెక్టర్ విజయేందిర తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): రాజ్యాధికారంతోనే ఏవర్గమైన అభివృద్ధి చెందుతుందని, ప్రస్తుత తరుణంలో రాజకీయ ప్రాధాన్యత ఉంటేనే ఆయా వర్గాలు అభివృద్ధి చెందుతాయని బీసీ, కుల సంఘాల నాయకులు అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల్లో అమలవుతున్న బీసీ రిజర్వేషన్లు జనాభా దమాషా ప్రకారం పెంచాలని విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల గుర్తింపు అంశంపై సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో రాష్ట్ర బీసీ డెడికేటెడ్ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించింది. ఈ సందర్భంగా వివిధ కుల సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. అలాగే నాయకులు, ప్రతినిధులు తమ అభిప్రాయాలను కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి భూసాని వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లారు. కమిషన్ కార్యదర్శి సైదులు, కలెక్టర్ విజయేందిరతో కలిసి ఆయన వినతులను స్వీకరించారు. వారు చెప్పిన అభిప్రాయాలను వినడంతో పాటు వినతిపత్రాలను స్వీకరించారు. సంఘాల వారీగా ప్రత్యేకంగా చర్చించి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. రాజకీయ ప్రాతినిథ్యం లేని కులాలు చాలా ఉన్నాయని, వాటికి కూడా రిజర్వేషన్ల ద్వారా రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కోరారు. మొత్తం 65 సంఘాల నాయకులు కమిషన్‌ను కలిసి వినతిపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిర పాల్గొన్నారు.

ఎవరేమన్నారంటే..

యాదవులకు పొలిటికల్ పవర్ ఉండాలని, అందుకనుగుణంగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలని యాదవ సంఘం అధ్యక్షుడు కాశన్న విన్నవించారు.

- రోస్టర్ పద్ధతిలో ఉన్న రిజర్వేషన్‌ను ఎస్టీ ఎరుకులకు తీసి వేశారని, గ్రామాల వారిగా రోస్టర్ తీసుకోవాలని ఎరుకుల సంఘం బాలయ్య కోరారు.
- 50 కులాలకు ఇంక రాజకీయ ప్రాధాన్యత రాలేదని సగర సంఘం అధ్యక్షుడు ప్రబీల్ పేర్కొన్నారు. బీసీలకు రిజర్వేషన్ పెంచాలని విన్నవించారు.
- పద్మశాలీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని సంఘం నాయకుడు సారంగి వినయ్‌కుమార్ పేర్కొన్నారు.
- సచార్ కమిటీ సిఫారస్సులను అమలు చేయాలని బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు మోసిన్‌ఖాన్ కోరారు.



పేదలకు న్యాయం చేయాలి..

90 శాతం ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీలకు న్యాయం చేయాలి. వారు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇల్లు తదితర సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రజలందరికీ కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్య అందించాలి. భూమి లేని ప్రజలందరికీ ఎకరం వ్యవసాయ సాగు భూమి, 200 గజాల స్థలంలో 4 గదులతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలి.

– విశారదన్ మహరాజ్, ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు

జీఓ 29 రద్దు చేయాలి



బీసీలు కులగణనలో ఎక్కడా పక్షపాతం లేకుండా నిర్వహించడంతో పాటు జీఓ 29 వెంటనే రద్దు చేయాలి. స్థానిక సంస్థల్లో 50 శాతం పైన బీసీలకు రిజర్వేషన్లు, బీసీల జనాభా అనుగుణంగా వార్షిక బడ్జెట్‌లో 65 శాతం నిధులు కేటాయించాలి. 3 శాతం ఉన్న ఓసీలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ 10 శాతం ఇవ్వడం వల్ల బీసీ విద్యార్థులు మంచి మార్కులు వచ్చినా ఉద్యోగాలు పొందలేకపోతున్నారు. దీనికి సరైన న్యాయం చేయాలి.

– ప్రభాకర్, బీసీ మేధావుల సంఘం ప్రధాన కార్యదర్శి

ముదిరాజ్‌లకు ప్రాధాన్యత ఇవ్వాలి..



బీసీ జనాభాలో సగభాగం ఉన్న ముదిరాజ్‌లకు రాజకీయ ప్రాధాన్యత లేదు. రాష్ట్రంలో 12,760 గ్రామాలకు గాను 8వేలకుపైగా గ్రామాల్లో ముదిరాజ్‌ల జనాభా అధికంగా ఉంది. వందశాతం ముదిరాజ్‌లు ఉన్న గ్రామాలు వందల్లో ఉన్నా రాజకీయ ప్రాధాన్యత లేదు. స్థానిక సంస్థల్లో ముదిరాజ్‌ల జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి.

– కృష్ణ ముదిరాజ్, తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు



రిజర్వేషన్ కల్పించాలి..

సమగ్ర కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. తెలంగాణలో 129కి పైగా బీసీ తరగతులు ఉండగా.. ఇప్పటికీ అత్యధిక శాతం సంప్రదాయ వృత్తులపై ఆధారపడి జీవిస్తున్నారు. సంచార జాతులు, ఎంబీసీ కులాలలో సామాజిక, ఆర్థిక వెనకబాటుతనం విపరీతంగా ఉంది. వీరిపై దాడులు, దౌర్జన్యాలు, కులవివక్ష, మహిళలపై అత్యాచారాలు అరికట్టేందుకు ప్రత్యేక రక్షణ చట్టం చేయాలి. 11 బీసీ ఎంబీసీ కార్పొరేషన్ల ఫెడరేషన్లకు పాలక వర్గాలను నియమించి తగిన బడ్జెట్ కేటాయించాలి.

– మోహన్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు

కులగణన ఆధారంగా..



ప్రస్తుతం జరుగుతున్న కులగణనలో వచ్చిన లెక్కల ఆధారంగా రిజర్వేషన్ కల్పించాలి. జిల్లాలో అత్యధికంగా బీసీలు ఉన్నారని, రేపు కులగణన జరిగిన తర్వాత వచ్చిన లెక్కల ఆధారంగా జనాభా ప్రకారం రిజర్వేషన్ కల్పించాలి. అలాగే స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి తగ్గకుండా రిజర్వేషన్ ఇవ్వాలి.

– శ్రీనివాస్‌సాగర్, బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు

ముస్లింలకు న్యాయం చేయాలి..



స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా 15 శాతం ఉన్న వెనకబడిన ముస్లింలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి. ముస్లింలలో 50 వెనకబడిన కులాలు ఉండగా.. వీటిలో 30 దాకా సంచార తెగలు ఉన్నాయి. వీరిని ఎస్టీలుగా, మిగిలిన 20 కులాలను బీసీలుగా గుర్తించి ముస్లింలకు 15 శాతం రిజర్వేషన్లు పెంచాలి.

– షేక్ ఫరూక్ హుస్సేన్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు

రజకులకు అన్యాయం



రాష్ట్రవ్యాప్తంగా 11 లక్షల జనాభా ఉన్న రజకులకు రాజకీయ ప్రాధాన్యత లేకుండాపోయింది. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడి ఉన్నామని, ఇంకా తమను అంటరానివాళ్లుగానే సమాజం చూస్తుంది. తమ జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించాలి.

– పురుషోత్తం, రజక సంఘం అధ్యక్షుడు

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి : ఎస్పీ



నారాయణపేట: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ పోలీసు అధికారులకు సూచించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఐదుగురు తమ ఫిర్యాదులను నేరుగా ఎస్పీని కలిసి విన్నవించారు. రెండు ఫిర్యాదులు ఫ్యామిలీ గొడవలకు సంబంధించినవి కాగా, 3 భూ–తగాదాలకు సంబంధించి ఫిర్యాదులు వచ్చాయి. భూ తగాదాలకు సంబంధించి ఎలాంటి సమస్యలు ఉన్నా కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలని, సామరస్యంగా మాట్లాడుకోవాలని ఎస్పీ సూచించారు. బాధితులు తీసుకువచ్చే ఎలాంటి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తుందని, ప్రజల మన్ననలు పొందే విధంగా విధులు నిర్వర్తించి వారికి సరైన న్యాయం అందించి భరోసా, భద్రత కల్పించాలని సూచించారు.

ధాన్యంతో కిక్కిరిసిన బాదేపల్లి యార్డు



జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పంట దిగుబడులతో కిక్కిరిసింది. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి 9,326 క్వింటాళ్ల ధాన్యం యార్డుకు విక్రయానికి వచ్చింది. ఇంత ధాన్యం యార్డుకు రావడం ఈ సీజన్‌లో ఇదే మొదటిసారిగా అధికారులు తెలిపారు. అదేవిధంగా 2081 క్వింటాళ్ల మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. మొక్కజొన్న క్వింటాలు గరిష్టంగా రూ.2,417, కనిష్టంగా రూ.1,912 ధరలు లభించగా ధాన్యం ఆర్ఎన్ఆర్ రకం గరిష్టంగా రూ.2,479, కనిష్టంగా రూ.1,550, హంస రకం రూ.2,011, రాగులు రూ.2,222, వేరుశనగ గరిష్టంగా రూ.6,213, కనిష్టంగా రూ.5,363 ధరలు లభించాయి.

ఏసీబీ వలలో పంచాయతీరాజ్ ఏఈ

- ఎంబీ రికార్డు చేసేందుకు రూ.50 వేలు డిమాండ్
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న అధికారులు



లంచం తీసుకుంటూ పట్టుబడిన పంచాయతీ ఏఈ పాండురంగారావు

ఎర్రవల్లి: ఓ కాంట్రాక్టర్ నుంచి లంచం తీసుకుంటూ ఓ పంచాయతీరాజ్ ఏఈ సోమవారం ఏసీబీ అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కాడు. ఏసీబీ అధికారుల కథనం ప్రకారం.. ఎర్రవల్లి మండలంలోని రాజశ్రీ గార్లపాడులో రూ.25 లక్షల వ్యయంతో ఓ కాంట్రాక్టర్ మైనారిటీ కమ్యూనిటీ భవనం (షాదీఖానా)ను నిర్మించి బిల్లు కోసం ఎంబీ రికార్డుల్లో నమోదు చేయాలని పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావును ఇటీవల సంప్రదించాడు. ఈ క్రమంలో తనకు కాంట్రాక్ట్ బడ్జెట్ ప్రకారం 2 శాతం కమీషన్‌గా రూ.లక్ష ఇస్తేనే ఎంబీలో బిల్లు ఎక్కిస్తానని తేల్చి చెప్పాడు. దీంతో సదరు కాంట్రాక్టర్ ఏఈతో చర్చలు జరిపి చివరికి రూ.50 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకొని.. ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ముందస్తు పథకం ప్రకారం సోమవారం ఉదయం బాధితుడు ఎర్రవల్లి కూడలిలోని జమ్‌జమ్ హోంనీడ్స్ దుకాణంలో ఏఈకి నగదు డబ్బులు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు దాడి చేసి, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం ఏఈ నుంచి వివరాలు సేకరించి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీబీ డీఎస్పీ శ్రీకృష్ణ గౌడ్ పేర్కొన్నారు. ఏసీబీ దాడుల్లో సీఐలు లింగస్వామి, జిలానీ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యానికి భరోసా

అనారోగ్యంతో బాధపడుతున్న 2,709 మంది విద్యార్థుల గుర్తింపు

- ఆర్‌బీఎస్‌కే ద్వారా జిల్లాలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు
- వ్యాధుల తీవ్రతను బట్టి మెరుగైన చికిత్సకు రెఫర్



నర్వ మండలంలోని పాఠశాల చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు (ఫైల్)

నర్వ: ప్రభుత్వ బడులు, కస్తూర్బా విద్యాలయాలు, వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యానికి ఆర్‌బీఎస్ అండగా నిలుస్తోంది. విద్యాలయాల్లో ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్యానికి భరోసా కలిగిస్తోంది. పలువురు వైద్యులు బృందాలుగా ఏర్పడి జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా.. అందులో 2,709 మంది పిల్లలు పలు అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని తెలిసింది. ముందుచూపుతో స్వల్ప అనారోగ్య లక్షణాలు దీర్ఘకాలిక వ్యాధులుగా మారకుండా ఉండేందుకు ఆర్‌బీఎస్‌కే మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది.

మెరుగైన వైద్య సేవలు..



ఆర్‌బీఎస్‌కె కార్యక్రమం పాఠశాలలు, వసతి గృహాలు, గురుకులాల వద్ద విద్యార్థుల చెంతకే బృందాలు వెళ్లి ఆరోగ్య పరీక్షలు నిర్వహించాం. అనారోగ్యంతో ఇబ్బందులు పడేవారికి సరైన సమయంలో చికిత్స అందజేస్తున్నాం. వ్యాదుల తీవ్రతను బట్టి మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నాం. విద్యార్థుల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లకుండా చర్యలు చేపడుతున్నాం.

– డాక్టర్ సాయిరాం, ఆర్‌బీఎస్‌కె జిల్లా కోఆర్డినేటర్

జిల్లా వివరాలిలా..

వైద్య బృందం	వైద్య పరీక్షలు పూర్తయిన విద్యార్థులు	వ్యాధులతో బాధపడుతున్న వారు
నారాయణపేట-ఏ	21648	541
నారాయణపేట -బీ	24737	694
మక్తల్ - ఎ	24872	457
మక్తల్ - బీ	22398	550
కోస్గి	21192	467

ప్రత్యేక బృందాలతో..

చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించేందుకు వైద్యాధికారి, ఫార్మసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్‌నర్స్‌తో కలిపి మొత్తం 5 ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. దీంతోపాటు పిల్లలకు నేత్ర పరీక్షల సమయంలో ప్రత్యేక నిపుణులు ఆ బృందంలో చేరి వైద్య సేవలందిస్తారు. ఈ ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి ఆరు నెలల పాటు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. వివిధ సమస్యలతో బాధపడే 2709 మంది చిన్నారులను గుర్తించి చికిత్సలు అందిస్తున్నారు. ఆయా మండలాల్లోని కస్తూర్బా, వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలలో దాదాపు 1.50 లక్షల మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో ప్రధానంగా న్యూరో, ఆర్థో, కార్డియక్, ఈఎన్‌టీ, డెర్మాటాలజీ, గైనికాలజీ, డెవలప్‌మెంట్ డిలే, డెంటల్, విజియన్, అనేమియా, మాల్‌న్యూట్రీషన్ వంటి వ్యాధులతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వీరికి జిల్లా ప్రధాన ఆసుపత్రుల్లో మెరుగైన చికిత్సలు అందిస్తున్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు

- రూ.500 బోనస్‌పై అనుమానం వద్దు
- కలెక్టర్ సిక్తా పట్నాయక్



లోకూర్తిలో ధాన్యంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

దామరగిద్ద: వరి ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని మల్‌రెడ్డిపల్లి, లోకూర్తి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఆమె పర్యవేక్షించారు. సన్నరకం ధాన్యం విక్రయించే రైతులకు రూ.500 బోనస్ ప్రభుత్వం అందిస్తుందని, బోనస్ వస్తుందో రాదో అనే అనుమానం పెట్టుకోవద్దని రైతులకు సూచించారు. మల్‌రెడ్డిపల్లి కేంద్రంలో ప్యాడీ క్లీనర్ యంత్రంలో వరిధాన్యం వేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదని అక్కడి సిబ్బంది తెలపడంతో కలెక్టర్ ధాన్యాన్ని యంత్రంలో వేసి క్లీనింగ్ ప్రక్రియను, గింజ పొడవు, వెడుల్పులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు సన్నరకం ధాన్యానికి బోనస్ డబ్బులు వారి ఖాతాల్లో జమచేస్తారన్నారు. లావురకం ధాన్యం కేంద్రాలకు రావడం లేదని నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆయా కేంద్రాల్లో ఎంతమేర ధాన్యం కొనుగోలు చేశారని ఆరా తీశారు. అలాగే, సమగ్ర కుటుంబ సర్వేను పర్యవేక్షించారు. కలెక్టర్ వెంట సివిల్‌సప్లై ఎండీ దేవదాస్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఐకేపీ ఏపీఎం నర్సిములు ఉన్నారు.

ప్రశాంతంగా ముగిసిన గ్రూప్–3 పరీక్షలు



జిల్లా కేంద్రంలో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులను తనిఖీ చేసి లోపలికి పంపిస్తున్న పోలీసులు

నారాయణపేట: జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రూప్–3 పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. కాగా సోమవారం జరిగిన పరీక్షకు జిల్లాలో 4,024 మంది అభ్యర్థులకుగాను 2,331 మంది హాజరు కాగా, 1693 మంది గైర్హాజరయ్యారు. సగటున 58 శాతం హాజరు నమోదైందని ఆమె వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రాల వద్ద గ్రూప్–3 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను పోలీసులు బందోబస్తు చేపట్టి లోపలికి పంపించారు.



విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నారాయణపేట ఎడ్యుకేషన్/కోస్గి రూరల్: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ పోటీలో 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు శిల్ప, భారతి, సిబ్బంది రఘు పాల్గొన్నారు.

కోస్గిలో..

సోమవారం కోస్గిలోని గ్రంథాలయ భవనంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పర్యావరణం–వాతావరణ మార్పు అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి చివరి రోజు బహుమతులు అందజేయనున్నామని తెలిపారు. అదేవిధంగా మంగళవారం మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు సన్మాన కార్యక్రమం, ఇందిరాగాంధీ జీవిత చరిత్రపై ఉపన్యాస, ముగ్గుల పోటీలు చేపట్టనున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘువర్ధన్ రెడ్డి ,నర్సిములు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విషాదం నింపిన పుట్టినరోజు వేడుక

- రోడ్డు ప్రమాదంలో కాళ్లు కోల్పోయిన ఇద్దరు స్నేహితులు

కోస్గి రూరల్: స్నేహితుడి పుట్టిన రోజు వేడుక ఇద్దరి జీవితంలో విషాదం నింపింది. వేడుకల్లో పాల్గొని వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై కాళ్లు కోల్పోయారు. ఈ సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని బహా ర్‌పేటకు చెందిన భరత్‌కుమార్, మున్సిపల్ పరిధిలోని సంపల్లికి చెందిన ఇంద్రజ కోస్గిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ సెకండియర్ చదువుతున్నారు. వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హస్నాబాద్‌కు చెందిన మరో స్నేహితుడు జనార్దన్ పుట్టినరోజు కావడంతో వారు అక్కడికి వెళ్లారు. పుట్టినరోజు వేడుకలు ముగించుకొని ద్విచక్రవాహనంపై బయలుదేరారు. మండలంలోని నాచారం గ్రామ శివారులో రోడ్డు మలుపు దగ్గర బైక్ అదుపుతప్పింది. ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. బైక్ లారీ కిందికి దూసుకుపోయి ఇద్దరికి కాళ్లు విరిగిపోయాయి. అటుగా వెళ్తున్న కొందరు గమనించి వారిని 108లో కోస్గి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. ఈసంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్‌ఐ బాలయ్య తెలిపారు.

కల్వర్టును ఢీకొని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ క్రైం: రాత్రివేళలో ఓ వాహనదారుడు కల్వర్టును ఢీకొట్టుకొని మృతి చెందాడు. రూరల్ ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మహమ్మదాబాద్ మండలం గాధిర్యాల గ్రామానికి చెందిన శ్రీనివాసరావు(32) ఆదివారం రాత్రి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో కోయిలకొండ ఎక్స్‌రోడ్ సమీపంలో కల్వర్టుకు ఢీకొట్టుకుని అక్కడికక్కడే మృతిచెందాడు. రాత్రివేళ కావడంతో మృతదేహం ఎవరూ గమనించకపోవడంతో సోమవారం ఉదయం వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలం పరిశీలించి మృతదేహం పోస్టుమార్టం విభాగానికి తరలించారు. అయితే శ్రీనివాసరావు భార్య భాగ్యలక్ష్మి భర్త మృతిపై అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లికాలేదని మనస్తాపంతో యువకుడి బలవన్మరణం

ఊట్కూరు: పెళ్లి కాలేదని మనస్తాపంతో భాస్కర్‌గౌడ్(31) అనే యువకుడు చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఈఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బాలయ్యగౌడ్ మూడో కుమారుడు భాస్కర్‌గౌడ్. అతడికి పెళ్లి చేయాలని కుటుంబ సభ్యులు చాలారోజుల నుంచి సంబంధాలు చూస్తున్నారు. ఎక్కడా పెళ్లి సంబంధం కుదురడం లేదు. దీంతో మనస్తాపం చెందిన యువకుడు గ్రామ సమీపంలోని చింతచెట్టుకు ఉరివేసుకున్నాడు. ఉదయం వేళ చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గ్రామస్తులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. వారు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ కృష్ణంరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోక్సో కేసులో వ్యక్తికి ఏడాది జైలుశిక్ష

గద్వాల క్రైం/ధరూరు: పోక్సో కేసులో ఓ వ్యక్తికి ఏడాది పాటు జైలు శిక్ష విధించారు. పోలీసుల కథనం ప్రకారం.. జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరు మండల పరిధిలోని వామనపల్లి గ్రామానికి చెందిన నీల బావి ఆంజనేయులు అనే వ్యక్తి 2021వ సంవత్సరంలో అదే గ్రామానికి చెందిన ఓ మైనర్‌తో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు గురిచేయడంతో అప్పట్లో రేవులపల్లిలో కేసు నమోదు చేశారు. సోమవారం జిల్లా కోర్టు కె.కుష నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ షుకూర్, పీపీ ఆనంద్ కుమార్ తెలిపారు.

ఉద్యోగాల పేరుతో మోసం



- నిరుద్యోగులే లక్ష్యంగా రూ.లక్షలు వసూలు
- రూ.6 లక్షలు ఇస్తే రైల్వేలో కొలువు అంటూ నమ్మించిన వైనం
- ఆరోగ్యశాఖలోనూ ఉద్యోగాలంటూ డబ్బులు వసూలు
- జోగుళాంబ గద్వాల జిల్లాలో ఆలస్యంగా వెలుగులోకి..

గద్వాల క్రైం: రైల్వే శాఖ.. వైద్య ఆరోగ్యశాఖలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ కొందరు చెప్పడంతో వారి మాయమాటలు నమ్మి జిల్లాలోని కొందరు నిరుద్యోగులు మోసపోయారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషయాలు జిల్లాలో కలకలం రేపాయి. గత నెలలో ఆరోగ్యశాఖలో కొలువులంటూ నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేయగా.. బాధితుల ఫిర్యాదు మేరకు గద్వాల రూరల్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదయ్యింది. తాజాగా గద్వాల పట్టణంలో ఓ నిరుద్యోగి రైల్వే శాఖలో కొలువు ఇప్పిస్తామని మోసగాళ్ల మాటలు నమ్మి రూ.లక్షలు చెల్లించి చివరకు తాను మోసపోయినట్లు గుర్తించి ఈ నెల 12వ తేదీన పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆరోగ్య శాఖలో కొలువులంటూ..

అదేవిధంగా జిల్లా ఆరోగ్యశాఖలో కొలువులు ఇప్పిస్తామని, తాము ఆ శాఖలోనే ఉన్నతాధికారులమంటూ యువరాజు, అతని స్నేహితుడు కొందరు యువకులను నమ్మించారు. కొలువులు ఇప్పిస్తామంటూ ఇటిక్యాల మండలానికి చెందిన కొంత మంది నిరుద్యోగుల నుంచి రూ.లక్షలు వసూలు చేశారు. కొన్నాళ్లకు ఎంతకూ ఉద్యోగ విషయం తేల్చకపోవడంతో యువకులు మోసపోయామని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గద్వాల రూరల్ పోలీసు స్టేషన్‌లో ఒకరిపైనే కేసు నమోదు అయ్యింది. సదరు నిందితుడిని ఈ నెల 16వ తేదీన రిమాండ్‌కు సైతం తరలించారు. అయితే నిందితుడి స్నేహితుడు మాత్రం కేసు నుంచి బయటపడినట్లు సమాచారం. నిరుద్యోగుల నుంచి వసూలు చేసిన డబ్బులు తిరిగి వారికి ఇచ్చేస్తానని ఒప్పందం చేసుకొని కేసు నుంచి బయటపడినట్లు సమాచారం. అతడి తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడం, మధ్యవర్తుల సహాయంతో తప్పించుకున్నట్లు తెలుస్తోంది. నిరుద్యోగులకు డబ్బులు ఇచ్చే క్రమంలో ఆధారాల కోసం వీడియోలు సైతం రహస్యంగా తీసుకున్నట్లు తెలిసింది. ఈ సంఘటనలో నిందితుడి స్నేహితుడిపై కేసు నమోదు కాకపోవడం కొసమెరుపు. ఈ కేసు విషయమై గద్వాల రూరల్ ఎస్‌ఐ శ్రీకాంత్‌ను సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఉద్యోగం పేరుతో రూ.6 లక్షలు వసూలు

గద్వాల పట్టణానికి చెందిన చిన్న నర్సింహులు గద్వాల మండలంలోని ఓ పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్నాడు. అయితే గద్వాల మండలానికి చెందిన భార్యాభర్తలైన అంకిత, జగదీశ్వర్‌రెడ్డితో సదరు నిరుద్యోగికి 2022లో పరిచయం ఏర్పడింది. రైల్వేశాఖలో తెలిసిన వ్యక్తులు ఉన్నారని, వారి నుంచి ఉద్యోగాలు ఇప్పిస్తామని, మంచి జీతం ఉంటుందని ఇందుకు డబ్బులు చెల్లిస్తే చాలని అంకిత, జగదీశ్వర్‌రెడ్డి దంపతులు.. చిన్న నర్సింహులును నమ్మించారు. ఈమేరకు అతని నుంచి రూ.6 లక్షలు వసూలు చేశారు. అయితే ఉద్యోగం కోసం పలుమార్లు సదరు దంపతులను చిన్న నర్సింహులు అడిగినా త్వరలో వస్తుందని నమ్మించి దాట వేశారు. చివరికి తాను మోసపోయినట్లు గుర్తించి పట్టణ పోలీసు స్టేషన్‌లో దంపతులపై ఫిర్యాదు చేశాడు.

మోసగాళ్ల మాటలు నమ్మొద్దు

ఉద్యోగాల పేరుతో మోసం చేస్తున్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే వ్యక్తుల మాటలు నమ్మి ఎవరు మోసపోవద్దు. జిల్లా వ్యాప్తంగా ఇలాంటి కేసులపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తాం. ఇక రూరల్ పోలీసు స్టేషన్‌లో నమోదైన కేసు, వచ్చిన ఆరోపణలపై విచారణ చేపడతాం.



– శ్రీనివాసరావు, ఎస్పీ

నిర్లక్ష్యం ఖరీదు.. రెండు ప్రాణాలు

- రివర్స్‌లో వస్తూ బైక్‌ను ఢీకొట్టిన లారీ
- ఇద్దరు యువకుల దుర్మరణం

వనపర్తి రూరల్: లారీ డ్రైవర్ నిర్లక్ష్యం రెండు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. ఎలాంటి సిగ్నల్ లేకుండా వెనక్కి అతివేగంగా వస్తూ.. బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ ఘటన వనపర్తి మండలం చిమనగుంటపల్లి గ్రామ శివారులో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ జలేందర్‌రెడ్డి వివరాల మేరకు.. చిమనగుంటపల్లికి చెందిన సెంట్రింగ్ కార్మికుడు అర్కట శివుడు (19), బాలకృష్ణ అలియాస్ విజయ్‌కుమార్ (20) వనపర్తిలో వ్యక్తిగత పనులను ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి బయల్దేరారు. గ్రామ శివారులోని వేబ్రిడ్జి వద్ద వడ్ల లారీ కాంటా వేసుకొని ఎలాంటి సిగ్నల్ లేకుండా వేగంగా రివర్స్‌లో వస్తూ వీరి బైక్‌ను ఢీకొట్టింది.



శివుడు (ఫైల్)



విజయ్‌కుమార్ (ఫైల్)

ప్రమాదంలో శివుడు, విజయ్‌కుమార్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా మార్చురీకి తరలించారు. మృతుడి తండ్రి అర్కట చిన్నకుర్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, రోడ్డు ప్రమాదంలో ఇద్దరి యువకుల మృతితో చిమనగుంటపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో భార్య మృతి

- భర్తకు గాయాలు
- మూసాపేట మండలం జానంపేట వద్ద ఘటన

అడ్డాకుల: మూసాపేట మండలం జానంపేట వద్ద 44వ నంబర్ జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో భార్య మృతి చెందగా భర్తకు గాయాలయ్యాయి. మూసాపేట ఎస్‌ఐ పి.శ్రీనివాసులు కథనం ప్రకారం...జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండలం గుడిదొడ్డి గ్రామానికి చెందిన దంపతులు వడ్డె భీమమ్మ(48), వడ్డె హనుమంతు కలిసి ద్విచక్రవాహనంపై షాద్‌నగర్‌కు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం మధ్యాహ్నం జానంపేట దాటిన తర్వాత బైక్‌ను హైదరాబాద్ వైపు నుంచి కర్నూలు వైపు వెళ్లే గుర్తు తెలియని వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ సంఘటనలో కింద పడిపోయిన భీమమ్మ పైనుంచి ప్రమాదానికి కారణమైన



భీమమ్మ మృతదేహాన్ని ట్రాక్టర్‌లో జిల్లా ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

వాహనం వెళ్లింది. దీంతో ఆమె తల భాగం ఛిద్రమై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త హనుమంతు గాయపడ్డాడు. స్థానికులు, పోలీసులు బాధితుడిని అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి పంపించారు. తల ఛిద్రమై మహిళ మృతదేహాన్ని ట్రాక్టర్‌లో జిల్లా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం కోసం గాలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి భర్త హనుమంతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గట్టు: మండలంలోని ఆరగిద్దకు చెందిన దళిత మల్లన్న (58) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఎస్‌ఐ మల్లేష్ వివరాల మేరకు.. ఈ నెల 15న మల్లన్న, అతడి సోదరులు హుస్సేన్, తిమ్మప్పల మధ్య పత్తి పొలంలో వివాదం చోటుచేసుకొని ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో మల్లన్నను కర్రలు, రాళ్లతో కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. అడ్డు వచ్చిన కుమారుడు సంజీవ్‌పై కూడా దాడి చేశారు. మల్లన్నను కర్నూల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. గద్వాల సీఐ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే క్రిమినల్ కేసులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ డి.జానకి, అధికారులు, విద్యార్థులు

- మెడికోలు స్నేహపూర్వకంగా ఉండాలి
- ఎస్పీ డి.జానకి

మహబూబ్‌నగర్ క్రైం: ర్యాగింగ్ వల్ల వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా, విద్యా వ్యవస్థ మొత్తం మీద ప్రతికూల ప్రభావం చూపుతుందని ఎస్పీ డి.జానకి అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం పాలమూరు మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎస్పీ హాజరై మాట్లాడుతూ ర్యాగింగ్ చేయడం వల్ల విద్యార్థుల శారీరక, మానసిక ఆరోగ్యం ఎలా ప్రభావితం అవుతుందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలు, చట్టాలు, కేసులు, ఇతర రక్షణ మార్గాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ అనేది కఠినమైన నేరంగా పరిగణిస్తారని, బాధితులు న్యాయ సహాయం పొందడానికి పోలీస్‌శాఖ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందన్నారు. ఇకపై ర్యాగింగ్ చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, శిక్షార్హులవుతారని హెచ్చరించారు. ర్యాగింగ్‌కు గురైనప్పుడు వెంటనే డైరెక్టర్, యాంటీ ర్యాగింగ్ కమిటీలకు తప్పక సమాచారం ఇవ్వాలన్నారు. దీంతో పాటు పోలీస్ హెల్ప్ లైన్ లేదా మహిళ హెల్ప్‌లైన్ నంబర్లు ఉపయోగించుకోవాలని సూచించారు. రహస్యంగా తమ సమస్యలను వెల్లడించడానికి పోలీసులు అందించిన మాధ్యమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కళాశాల యాజమాన్యం ప్రతి విద్యార్థి భద్రతకు సంబంధించిన ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. యాంటీ ర్యాగింగ్ కమిటీలు మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. ర్యాగింగ్ నిర్మూలన కోసం అందరి సహకారం అవసరమని, సీనియర్, జూనియర్ విద్యార్థులు ఎప్పుడూ స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. అనంతరం యాంటీ ర్యాగింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రమేష్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సీఐ గాంధీనాయక్, అధ్యాపకురాలు రమాదేవి పాల్గొన్నారు.

ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తి

- జూరాలకు 6 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- నెట్టెంపాడుకు కొనసాగుతున్న నీటి పంపింగ్

ధరూరు/ రాజోళి: జూరాల జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలోని ఒక యూనిట్‌లో విద్యుదుత్పత్తిని ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో స్వల్పంగా పెరిగింది. దీంతో నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపులో నీటి పంపింగ్ కొనసాగిస్తున్నారు. ఆదివారం ప్రాజెక్టుకు 2,800 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. సోమవారం సాయంత్రానికి ప్రాజెక్టు వస్తున్న ఇన్‌ఫ్లో 6 వేల క్యూసెక్కులకు పెరిగింది. విద్యుదుత్పత్తి నిమిత్తం 5,157 క్యూసెక్కులు, నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 730 క్యూసెక్కులు, కుడి కాల్వకు 530 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–1కు 630 క్యూసెక్కులు, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 950 క్యూసెక్కులు వదిలగా.. మరో 72 క్యూసెక్కులు ఆవిరైంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 9.604 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

సుంకేసులలో 1.235 టీఎంసీలు

సుంకేసుల డ్యాంలో సోమవారం 1.235 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు జేఈ మహేంద్ర తెలిపారు. ఎగువ నుంచి 9,220 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రాగా.. కేసీ కెనాల్‌కు మాత్రమే 2,445 క్యూసెక్కులు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాం సామర్థ్యం మేర నీటి నిల్వ ఉన్నట్లు ఆయన పేర్కొన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం నాటికి పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వ ద్వారా 730 క్యూసెక్కులు, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాల్వ ద్వారా 960 క్యూసెక్కులు కుడి, ఎడమ కాల్వ ద్వారా 25 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నామని ఏఈ వరప్రసాద్ తెలిపారు.

గుట్కా పాకెట్లు స్వాధీనం

నారాయణపేట: జిల్లాకేంద్రంలోని సత్యసాయి కాలనీకి చెందిన పూరి శ్రీధర్ రేకుల షెడ్డులో సోమవారం టాస్క్‌ఫోర్స్, నారాయణపేట పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించి నిల్వ ఉంచిన ప్రభుత్వ నిషేధిత గుట్కా పాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. గుట్కా పాకెట్ల విలువ రూ.6,80,460 ఉంటుందన్నారు. ఈ మేరకు గుట్కా సంచులను పోలీస్‌స్టేషన్‌కు తరలించి పూరి శ్రీధర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేట టౌన్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. నారాయణపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రభుత్వం నిషేధించిన గుట్కా పాకెట్లను ఎవరైనా అక్రమంగా నిల్వ ఉంచిన, ప్రజలకు అమ్మిన, రవాణా చేసిన చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.



కొండంత దేవుడు.. కురుమతిరాయుడు



జాతర మైదానంలో భక్తుల రద్దీ

- జాతర ఉత్సవాలకు తరలివస్తున్న భక్తులు

చిన్నచింతకుంట: అమ్మాపురం సమీపంలోని కురుమతిరాయుడి కొండల్లో గోవింద నామస్మరణ మారుమోగింది. బ్రహ్మోత్సవాలు, జాతరను పురస్కరించుకొని సోమవారం కురుమూర్తిస్వామి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ముందుగా ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు క్యూలైన్లో నిల్చొని కొబ్బరికాయలు కొట్టి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ మెట్లపైన, స్వామివారి పాదుకల వద్ద, ఆలయ సన్నిధిలో దీపాలు వెలిగించి మొక్కుకున్నారు. కొండదిగువన దాసంగాలు, గండదీపాలు మోసి వేడుకున్నారు. తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే అలివేలు మంగమ్మ, ఉద్దాల మండపం, ఆంజనేయ, చెన్నకేశవస్వామి ఆలయాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో వివిధ వస్తువులను కొనుగోలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

■ కురుమూర్తిస్వామిని సోమవారం జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆయనను శాలువాలతో సత్కరించి.. తీర్థప్రసాదాలు అందజేశారు.



కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



మెట్లపై దీపాలు వెలిగిస్తున్న భక్తులు




కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్



క్యూలైన్లో నిల్చొన్న భక్తులు

సూక్ష్మ పోషకాల లోపాన్ని పూరించాలి

ఉప్పునుంతల: వేరుశనగ పంటకు సూక్ష్మపోషకాలైన జింక్, క్యాల్షియం, సల్ఫర్, గంధకం లోపం ఏర్పడి ఆకులు పసుపు వర్ణానికి మారి మొక్కలు గిరకబారిపోతున్నాయని మండల వ్యవసాయాధికారి రమేష్ తెలిపారు. రైతులు ఆలస్యం చేయకుండా సూక్ష్మ పోషకాల లోపాన్ని పూరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనం వేయకముందు దుక్కిలో పోషకాలు అందించే ఎరువులు వేసుకోవల్సిన సమయం దాటిపోయినందున ప్రస్తుతం రైతులు మార్కెట్లో అందుబాటులో ఉండే మల్టీకే (సూక్ష్మ పోషకాల మిశ్రమం)ను 10 గ్రాముల పొడి మందును లీటరు నీటిలో కలిపి ఆకులు తడిసే విధంగా మొక్కలపై పిచికారీ చేసుకోవాలి. పంట పూత, ఊడలు దిగే దశలో ఉన్న పంటకు ఎకరాకు 200 కేజీల జిప్సంను చల్లుకోవాలి. జిప్సంలో మొక్కలకు అవసరపడే సూక్ష్మ పోషకాలు ఉంటాయని ఆయన తెలిపారు.



పసుపు వర్ణానికి మారిన వేరుశనగ మొక్కలు

నేషనల్ బాస్కెట్‌బాల్ పోటీలకు హిమనయన

మహబూబ్‌నగర్ క్రీడలు: చత్తీస్‌ఘడ్ రాష్ట్రం రాజ్‌నంద్‌గాంలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా స్టేడియంలో సోమవారం నుంచి ప్రారంభమైన 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయస్థాయి అండర్–14 బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌కు జిల్లా క్రీడాకారిణి హిమనయన ఎంపికైంది. ఇటీవల రంగారెడ్డి జిల్లా మేడ్చల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్–14 ఎస్‌జీఎఫ్ బాస్కెట్‌బాల్ టోర్నీలో పాల్గొన్న రాష్ట్ర బాలికల జట్టుకు ఎంపికైంది. తొలిసారిగా జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ టోర్నీలో రాష్ట్ర జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించింది. హిమనయన రెండేళ్ల నుంచి జిల్లా కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో కోచ్ ఎండీ ఖలీల్ వద్ద బాస్కెట్‌బాల్‌లో శిక్షణ తీసుకుంటోంది. జడ్చర్లలోని ఎస్‌వీకేఎం స్కూల్‌లో చదువుతోంది.



జాతీయ గోగేమ్‌లో క్రీడాకారుల ప్రతిభ

- ఐదు బంగారు, ఒక కాంస్య పతకం



పతకాలు సాధించిన రాష్ట్ర క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌లో ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు జరిగిన జాతీయస్థాయి 2వ సీనియర్, 1వ సబ్ జూనియర్, జూనియర్ గోగేమ్ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు గోగేమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ సీనియర్ ఉపాధ్యక్షులు మహ్మద్ షకీల్ అహ్మద్ తెలిపారు. సబ్ జూనియర్ సింగిల్ విభాగంలో చేతన్ చంద్ర, కె.శిరీష బంగారు పతకాలు, జూనియర్ విభాగంలో కె.హారిక బంగారు పతకం, బషీర్ కాంస్య పతకం, సీనియర్ సింగిల్ విభాగంలో మహ్మద్ రయ్యాన్ నజమ్ బంగారు పతకం, సబ్ జూనియర్ టీమ్ ఈవెంట్‌లో రాష్ట్ర జట్టు బంగారు పతకం సాధించినట్లు తెలిపారు. పతకాలు పొందిన క్రీడాకారులను గోగేమ్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షులు నసరుల్లా హైదర్, కార్యదర్శి గులాం అఫ్రోజ్, కోశాధికారి వినోద్‌కుమార్ అభినందించారు.